కథ

# భీము

మూలం : ఎస్.ఎం.శిరహట్టి

అనువాదం : స్కంద

బెళగాంలో నా అల్లునికి ఇంటర్వ్యూ వుంది. అతని కేవిధంగా నైనా సాయం చేద్దామని నేను కూడా బెళగాం వెళ్లాను. బస్‌స్టాండులో నా అల్లుడు నాకు స్వాగతం పలికాడు. అపోలో హోటల్లో నాకు వసతి ఏర్పాటు చేశాడు. మరునాడే జరగ వలసిన ఇంటర్వ్యూ ప్రభుత్వ సెలవుల కారణంగా మూడు రోజులు ముందుకు పోయింది.

ఆ మూడు రోజులు అక్కడనే వుండి బెళగాంలోని ముఖ్యమైన మందిరాలను, కట్టడాలను చూద్దామని ఒక రిక్షాను బాడుగకు ఏర్పాటు చేసుకొన్నాను. రిక్షావాలా వచ్చాడు. రిక్షా ఎక్కాను.

“ఎక్కడికి సార్?” అడిగాడు రిక్షావాలా.

“సదాశివనగరం ..... తమ్ముడూ నీ పేరేమి?” అడిగాను.

“భీము” చెప్పాడు. చెప్తూ రిక్షా నెట్టుకొంటూ పరుగెత్తాడు. అది సొంతగా పరుగులు తీసిన తరువాత ఠకీమని సీటు మీద ఎక్కి తొక్కసాగాడు.

అది సైకిల్ రిక్షా. కాళ్లలో బలమున్నవాడే దాన్ని నడపగలడు. నా తలలో ఏవేవో ఆలోచనలు పడగ విప్పుతున్నాయి. ఆరోజే అక్కడ నాకడపటి రోజు.

ఇంతకు ముందు జట్కాలు, టాంగాలు, బగ్గీలు యాత్రికులకు అక్కరకు వచ్చేవి. వాటిని గుర్రాలు లాగేవి. మనిషి ఈ గుర్రాలను పక్కకు పెట్టిన తరువాత, రిక్షాలు వాడుకలో వచ్చాయి. వీటిని మనిషే తొక్కాలి. చాలా ఏళ్లు మనిషి ఈ గుర్రాలతో పోటీ పడవలసి వచ్చింది. ఇప్పుడు సైకిల్ రిక్షాల సంఖ్య పెరిగింది. జట్కాలు, టాంగాలు తగ్గి పోయాయి.

మనిషి గుర్రం కన్నా మంచివాడు. రెండు కాళ్లతో తన్నలేడు. గుర్రం ఒక పశువు. దానికి చట్టం, శాసనం తెలియవు. నడివీధిలోనే మలమూత్ర విసర్జన చేయగలదు. అది అనాగరికత. చట్టవిరుద్ధం, అపరాధం. ఇదంతా ఆ ప్రాణికేం తెలుసు? కాని మనిషి.... అలా కాదు. గుర్రంలా అపరాధం చేయలేడు. అతని వల్ల అనాగరికత సంభవించదు. తన రిక్షాలో కూర్చున్న ప్రయాణికునితో సుఖ-దుఃఖాల గురించి వాకబు చేయగలడు. స్నేహం సంపాదించుకోగలడు. అతడు సంఘజీవి.

రెండు రోజుల్లో అతడు నాకు చాలా దగ్గరయ్యాడు. అతని ఇల్లు గణపతి గల్లీలో వుందట. రోజూ అర్ధరాత్రి వరకూ ... అంటే, మొదటి సినిమా విడచిన తరువాత కూడా ఒకటి రెండు గిరాకుల్ని వారి వారి స్థావరాలకు చేర్చి, తను ఇల్లు చేరుతాడు. ఆ సమయంలో మందకొడిగా వెలిగే తన లాంతరు వెలుతురులో ఇల్లు చేరుతాడు. అతని భార్య మధ్యరాత్రి వరకూ అతనికోసం ఎదురు చూస్తూ వుంటుంది. రెండు రోజుల్లోనే మా ఇద్దరి మధ్య గాఢమైన స్నేహం కుదిరింది. నలభై ఏళ్ల అతని జీవిత విశేషాలను నేను తెలుసుకోగలిగాను.

నాకు చదివే పిచ్చి ఎక్కువ. నేను బస చేసిన హోటల్ వసారాలో రాత్రి చాలాసేపు చదువుతూ కూర్చొంటాను. రాత్రి సుమారు రెండు గంటల సమయంలో ఇంటి దారి పట్టిన భీము రిక్షా గంట కొట్టి, “నమస్కారం సార్. ఇంకా తమరు నిద్రపోలేదా?” అని ప్రేమతో పలకరించి, “వస్తాను సార్, నమస్కారం” అంటూ రిక్షా పోనిచ్చేవాడు.

మొదటి రోజు అతనికి నా హోటల్‌లోనే భోజనం పెట్టించాను. నాతో భోంచేస్తూ అతడన్నాడు కదా: “సార్ మీరు చాలా విచిత్రమైన మనుషులు సార్ .....” నోట్లో ముద్ద పెట్టుకొంటూ కళ్లు తుడుచుకున్నాడు.” నేను ఒంటరిగా భోంచేసింది ఇదే మొదలు సార్. ఇంత త్వరగా తిన్నది కూడా ఇదే మొదలు. ఇంతకు ముందు ఒకసారి తిన్నాను. అప్పుడు నా భార్య సందులోని అమ్మలక్కలను పిలిచి, అందరితో నన్ను ‘ఛీ’ అనిపించింది. చాలా గందరగోళం చేసిందిలేండి. అప్పుడది ఇంకా చిన్నపిల్ల. ఇప్పుడేముంది సార్, ముగ్గురు పిల్లలు నాకు. ఇద్దరు అబ్బాయిలు, ఒక్కతే అమ్మాయి. ఇప్పుడు భయం పోయింది. పిల్లలు కాకుండా నేనే ఆపరేషన్ చేయించుకొన్నాను. రాత్రి ఎంత పొద్దు పోయినా నా భార్య నాతోనే భోం చేస్తుంది. నే వెళ్ళిన తరువాతనే దానికి నిద్ర. ఎందుకంటే దాని ఆరోగ్యం ఏం బాగా లేదు. ఎప్పుడూ రోగంతో బాధ పడుతూ వుంటుంది. పుట్టుకతోనే రోగిష్టిది.” అని దీర్ఘంగా నిట్టూర్చాడు.

భీముని వేడి నిట్టూర్పు నాలో ఆలోచనల జ్వాలనురగిలించింది. గుర్రాలుడబ్బు సంపాదించగలవు. పరుగెత్త గలవు. కాని, వాటికి భార్యల బాధ ఎక్కడిది? అవి భీముని మాదిరి ఇలా నిట్టూర్చ లేవు కదా! నేను అతని మాటలను వింటూ కూర్చొన్నాను. తనభార్య గురించిఅతడు చెప్పుతున్న దుఃఖ తప్తమైన మాటలను నేను ఆపలేదు. అతడు అలా చెప్పూనేవున్నాడు. ఈ భీము గుర్రమై పుట్టివుంటే బాగుండేది. అప్పుడు ఈ భార్య, పిల్లలు, సంసారం అనే జంజాటం వుండేది కాదు. శ్రమ, సంపాదన, విశ్రాంతి వీటి గురించి ఆలోచన తప్ప సంసార తాపత్రయం వుండేది కాదు. కాని, ఇతడు మనిషి. అందుకే ఇతనికి భార్య పిల్లల గురించి బెంగ. పిల్లల కేదైనా కీడు కలిగితే బాధ పడుతాడు, నిట్టూర్చుతాడు. వారితో పాటు తను కూడా మైనంలా మెత్త బడతాడు.

భీముని ఎదమీద యాత్రికుల భారముంటే, అతని మనసు మీద భార్య పిల్లల భారం! ఇదేమి తక్కువ భారం కాదు. సంసార భారం ఎంతనేది మోసేవారికే తెలుసు. ఆ భారాన్ని తూకం చేసి ఇంతని చెప్పలేము.

భీమున్ని గుర్రంతో పోల్చలేం. మనిషి-పశు



...ధ్య పోలిక కుదరదు. వ్యాపారరీత్యా భీము గుర్రాన్ని జయించాడు. అయితే అతడు మాత్రం పశువుగా మారలేదు. ఇదే నాకు సమాధానం, సంతృప్తి.


"భీము, నీవు ఎన్ని గంటలకు నిద్ర పోతావు?" అడిగాను నేను.

"సార్, రాత్రి రెండు రెండున్నర గంటలకు నిద్ర పట్టొచ్చు. కొన్ని సార్లు తెల్ల వారే ముందు రావచ్చు. కాని, అదే సమయంలో మసీదులోని అజా వినబడుతూంది. పక్క వదలక తప్పదు. ముఖానికిన్ని నీళ్లు చల్లుకొని, రిక్షాఎక్కి బస్టాండు చేరుతాను." ఇంత చెప్పి ప్లేటులో చేయి కడుక్కొన్నాడు. 'భో' అని తేన్చాడు.


"ఇక సెలవు ఎప్పుడు?"

"సెలవు తీసుకుంటే అన్నం పెట్టే దాతలెవరు సార్? రెక్కాడితే డొక్కాడని బతుకులు మావి." చిన్నగా నవ్వి, "ఈ పాపి కడుపొక్కటే కాదు, బడికెళ్లెఇద్దరు మగపిల్లలు, ఒక ఆడ పిల్ల, నా పెళ్లాం... వీరి కడుపుకింత తెచ్చేయ్యాలి కదా. పండగ రోజు కూడా తప్పించుకోను. ఎందుకంటే రోజుకన్నా ఆనాడు సంపాదన ఎక్కువ." అన్నాడు.

ఆకలి ఎంత తీవ్రమైన జ్వాల అనేది నాకప్పుడు అర్థమయ్యింది. అన్నం కోసం శ్రమించే రెక్కలు ఎంతో బలిష్ఠంగా వుండాలి



కదా! అలా వుంటే మాత్రం కడుపుకు చాలినంత అన్నం సాధించగలడని అజ్ఞాని రిక్షావాలా నాకు పాఠం నేర్పాడు. పశువులూ అంతే .... దేహం దృఢంగా వుంటే మాత్రం కడుపుకింత కూడు దొరకుతుందని పెదవి విప్పకుండా శ్రమిస్తాయి. పశువులు కొన్ని సార్లు పని నుంచి తప్పించుకోవచ్చు. కాని, మన భీము మాత్రం రోజూ శ్రమించవలసిందే. పన్నెండు నెలలూ రిక్షా తొక్కవలసిందే. తాను తన రిక్షా ఒక లోకం. తరచూ ఆ లోకాన్ని ఇంటి గురించిన చింతలు చుట్టు ముట్టుతుంటాయి.



పాపం! ఆ రిక్షా కూడా అతని సొంతం కాదు. బాడుగది. రోజుకు ఎనిమిది రూపాయిలు బాడుగ. అదొక విధవకు సంబంధించిన రిక్షా. ఆమె ప్రత్యేకంగా ఏ పనిపాట చేయదు. ఆమె దగ్గర మూడు రిక్షాలున్నాయి. అందులో ఒక రిక్షాను భీము ఖాయం చేసుకొన్నాడు. సొంతంగా ఒక రిక్షా కొనాలనే ఆశతో డబ్బు కూడబెట్టుతాడు. కాని, అది తన భార్య ఔషధోపచారానికి ఖర్చయిపోతూంది. మొత్తానికి అతనికి బాడుగ రిక్షానే గతి. అది అతనికి, అతని సంసారానికి 'అన్నపూర్ణ'.

భీము రిక్షా నడిపే ప్రావీణ్యాన్ని నేను చాలా మెచ్చుకుంటాను. బస్సు, లారి, రాజదూత, లూనా మొదలైన వాహనాల బారి నుంచి ఉపాయంగా తప్పుకొని రిక్షా తొక్కగల అతని నైపుణ్యాన్ని చూసి నేను నివ్వెరపోతాను. అంతకు ముందు జట్కా, టాంగాలను లాగే గుర్రాల మెడలో గజ్జల పట్టీ కట్టేవారు. అదేవిధంగా భీము తన రిక్షాకు గజ్జలు కట్టాడు. ఇలా గజ్జలుండాలని చట్టం కూడా చెబుతూంది. కాని గజ్జల్ని తన మెడకు కట్టుకోలేదు. రిక్షా ఇరుసుకు కట్టాడు. అందుకే లయబద్ధంగా అవి మ్రోగుతాయి. రిక్షాలో కూర్చొన్న వారు వీటితో పాటు తమ చేతులతో లేక కళ్లతో తాళం వేస్తారు. కాని భీము మాత్రం ఈ అనుభూతి నుంచి దూరమే వుంటాడు. రస్తా మధ్యలో నడిచే వారు ఈ గజ్జల సద్దు విని పక్కకు జరిగి రిక్షాకు దారి ఇచ్చేవారు. భీము చాలా మంచివాడు. బాడుగ డబ్బు చేతులో వుంచితే సంకోచంగా తీసుకొని, చిన్నగా నవ్వి జేబులో వేసుకుంటాడు, తనేదో మనకు మేలు చేస్తున్నట్లు.

ముందు సదాశివ నగర్ చేరాను. అక్కడున్న నా పాత విద్యార్థిని కలిశాను. నాకు వీడ్కోలు చెప్పేందుకు వచ్చిన అతన్ని చూసి భీము చేతులు జోడించాడు. నా విద్యార్థి ప్రతి వందనం చేస్తూ, "ఏమయ్యా భీము, బాగున్నావా?" అన్నాడు.

"తమ దయవల్ల ఇలాగున్నా సార్" తన గొంతులో దాగున్న సుఖ-దు:ఖాలను దిగమింగి బాగున్నానన్నాడు. ఇది మనిషి గుణం. ఎప్పుడూ ఏడుపు ముఖంతో వుంటే ఎవరూ దరికి రారని భీమునికి తెలుసు. ఇతని బదులు ఒక పశువు ఆ స్థానంలో వుండి వుంటే ..... నమస్కార చమత్కారాల వూసే వచ్చేది కాదు.

పాపం! పేరుకు భీము కాని, అతడొక బక్క మనిషి. ఎముకల గూడు మాత్రం మిగిలి, కండరాలన్నీ కరిగి పోయాయి. కళ్లు లోయ లైనాయి.

ఖాయిలా పడ్డ ఎద్దును రిక్షాకు కట్టివుంటే దానికెన్నెన్ని పేర్లు, శాపాలు పెట్టేవారమో మనం. కాని భీము ఎద్దు కాదు. అయితే కఠిన హృదయుడని చెప్పలేను. ఎందుకంటే తాను అనారోగ్యంతో వున్నా కూడా రిక్షా తొక్కుతున్నాడు. చట్టం అతని ఈ ప్రవర్తనను ఆపదు, ఆపలేదు. రిక్షాలో నేను ఎక్కి కూర్చొన్నాను. భీము రిక్షాను కొంత దూరం నెట్టుకొని పోయి, అది స్వయంగా దొర్లుతూ వుంటే ఇక దాని మీద ఎక్కి కూర్చొన్నాడు.

"ఎక్కడికి సార్?"

"అపొలో"

భీము మౌనంగా పెడల్ తొక్కుతున్నాడు. స్వల్పంగా దగ్గాడు. తరువాత సముద్రంలోని అలలుగా దగ్గు గుద్దుకొని వచ్చింది. దగ్గు ఆగిన తరువాత దీర్ఘంగా శ్వాస పీల్చాడు. పాపం! అతని ఆర్థిక అవసరాలు ఈ రిక్షా తొక్కే పనికిపురికొల్పాయి. గుర్రం కాని, ఎద్దు కాని ఇలాంటి ఒత్తిడికి తల వంచేవి కావు. భీము ఎద్దుకాదు కదా! గుర్రం అంతకన్నా కాదు. తెలివి గల మనిషి. అందుకే అతనికి దగ్గున్నా, జ్వరమున్నా, తన అస్థిపంజరం స్ప్రింగులా వ్యాకోచించినా, సంకోచించినా సహించవలసిందే. అతని అవస్థ చూసి నేనే, "భీమూ, నిదానంగా పోనిలే. అంత తొందరేం లేదు." అన్నాను.

రిక్షా చలనం నిదానమైతే భీము ఎక్కువ శక్తిని వినియోగించ వలసి వచ్చేది. అప్పుడతడు జోరుగా ఊపిరాడ వలసి వచ్చేది. కమ్మరి తిదిలా అతని ఎద ఎత్తుగా ఉబ్బేది.

"భీమూ.... నీకు ఆరోగ్యంబాగా లేదా?' అని వెనకకొకసారి అడిగి వుంటే, "ఔను సార్" అన్నాడు. అప్పుడు కూడా అంతే, అతని ఎద నిండుగా వ్యాకోచం చెందేది. "ఇప్పుడెంతో మేలుసార్. మిగిలే నమ్మకమే లేక పోయింది. ఆరు నెలలు విశ్రాంతి తీసుకొన్నాను. ఇప్పుడిప్పుడే రిక్షా ఎక్కాను. అంతే ....." అన్నాడు.

ఇంత త్వరగా మేలుకొన్న ఇతడు తన ఆరోగ్యం గురించి కాసింత గమనించ వలసింది. ఇంత బలహీనంగా వున్న ఇతని రిక్షాలో ఎక్కేందుకు ఎవరూ సాహసించరు. రిక్షా ఎక్కే ముందు ప్రయాణికులు సామాన్యంగా రిక్షా తొక్కేవాని, ఆరోగ్యాన్ని పరిశీలిస్తారు. భీముని ఆకారం చూస్తే బహుశా ఎవరైనా అంతే, రిక్షా ఎక్కేందుకు వెనకాడవచ్చు. రిక్షా ఎక్కే ముందు రిక్షా తొక్కేవాని బలాన్ని అంచనా వేస్తారు యాత్రికులు.

"రోజూ ఎంత సంపాదిస్తావు?"

"ఎక్కడి సంపాదన సార్. జనం నా రిక్షాలో అడుగు పెట్టేందుకే జంకుతారు. బాగా కోలుకొని రావయ్యా, అంటారు.... అందరూ."

"ఎన్ని రోజులైంది నీవు రిక్షా ఎక్కి?"

"మొన్ననే సార్ .... పదిహేను రోజులయ్యింది"

"ఏం చేసేది భీము. అంతా నీ ఖర్మ." అన్నాను. అంతలో అపొలో హోటల్ వచ్చేసింది.

"భీమూ రిక్షా ఆపు. పద పైకి పోదాం" పిలిచాను.

"ఇప్పుడు రాను సార్. మళ్లీ ఎప్పుడైనా వస్తాను లెండి. క్షమించండి." అంటూ తన రిక్షా హేండలు పట్టుకొన్నాడు. నేను అతని వెనకగా వచ్చి వీపు మీద చేయి వేసాను. వీపు వెచ్చగా వుంది. ఉలిక్కిపడి అడిగాను.

"భీమూ, ఏమిటిది ఒళ్లంతా వెచ్చగా వుంది?"

"ఇప్పుడే కాదు. ఎప్పుడూ అది నాకు తోడుగా వుంది కదా", అంటూ దీనంగా చూశాడు.

"ఒక కప్పు టీ తాగిపోతే మంచిది కదా!" అన్నాను.

"ఎలాగూ సాయంత్రం వస్తాను కదా. అప్పుడు తాగుతానులెండి. ఇప్పుడు మీరిచ్చే బాడుగ కూడా తమ దగ్గరే వుండనీ...." అంటూ ఏడ్వలేక నవ్వి, నమస్కారం పెట్టి వెళ్లిపోయాడు. నేను అలాగే నిలిచిపోయాను. అతడు నా దృష్టి నుండి దూరంగా వెళ్లిన తరువాత నా రూము చేరుకున్నాను. అతని పరిస్థితి గురించి ఆలోచిస్తూ కూర్చొన్నాను. లేమితనం చలిలో కూడా చెమట పుట్టిస్తూంది. వర్షాకాలంలో జ్వరాన్ని పెంచుతూంది. ఎండాకాలంలో కూడా ఆకలి కలిగిస్తూంది. ఎంతటి దారుణ పరిస్థితి ఇది? పై అంతస్తులో కూర్చొని హాయిగా కాలం గడిపే మనలాంటి వారికి ఇదంతా ఎలా అర్థమయ్యేను?

దారుణ దారిద్ర్య చిత్రాన్ని భీము నాకు నగ్నరీతిలో చూపించాడు. ఒక వేళ నేనొక మంత్రి అయివుంటే ........ ! ?

ఈ భావన ..... బహుశా భావనలా మిగిలిపోతుందేమో ! ఎందుకంటే చాలా మంది మంత్రులు బీద కుటుంబంలో పుట్టి పెరిగి ప్రజల నుంచి విలువైన ఓట్లు సంపాదించి, మంత్రి పదవి పొందిన తరువాత దారిద్ర్యం గురించి అసలు యోచించరు, అంతెందుకూ బీదవారి ముఖాలు చూసేందుకే అసహ్యించుకొంటారు. బురదలో పుట్టి పెరిగిన కమలం బురదనే విస్మరించినట్లు.

ఎందుకో బేజారు. అన్నం తినబుద్ధి కాలేదు. మంచంలో పొర్లుతున్న నాకు ఎప్పుడు నిద్ర పట్టిందో మరి.

అల్లుడే వచ్చి లేపాడు. అప్పుడు సమయం ఐదు గంటలు, లేచి ముఖం కడుక్కొని, అక్కడికే టిఫిన్ తెప్పించుకొని తింటూ కూర్చొన్నాము.

"ఎందుకో ఇంకా రిక్షా రాలేదు ?" అన్నాను.

నా ప్రశ్న తన చెవిలో పడలేదన్నట్లు ఉదాసీనంగా కూర్చొన్నాడు నా అల్లుడు. అతనికి భీము పరిస్థితి తెలుసు. కాని, నాకు చెప్పేందుకు అతని మనసు ఒప్పలేదు కాబోలు, టిఫిన్, టీ అయిన తరువాత మెల్లగ పెదవి విప్పాడు.

"మామా ! భీము మెడికల్ కాలేజీ శ్యానిటోరియంలో అగుపించాడు. అతనికి క్షయమట. రెండవ దశలో వుండట. ఇప్పుడతడు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలట." రెండు మాటల్లో భీముని సజీవ దహనం చేసేశాడు నా అల్లుడు.

భీముని ఆరోగ్యపరిస్థితి విని నేను చలించి పోయాను. గుర్రంలా పని చేసే మన భీము దవాఖానాలో చేరి చికిత్స పొందినా బ్రతికి బయటపడడం కష్టమే అని నిర్ణయించాను. భీము పాపం గుర్రాన్ని కూడా జయించి బ్రతుకు బండిని లాగాడు. మరునాడు ఉదయమే ఊరికి ప్రయాణమయ్యాను. బ్యాగ్ చేతబూని, బిల్లు కట్టి బయటపడ్డాను. ఎదురుగా భీము ప్రత్యక్షమయ్యాడు.

"సార్, నమస్కారం" అన్నాడు. ఒక రోజులోనే గుర్తు పట్టలేనంతగా మారిపోయాడు భీము.

చేతిలోని బ్యాగ్ కిందపెట్టి, పర్స్ తీసి నూరురూపాయి కాగితం బైటికి లాగి భీము చేతిలో ఉంచి చెప్పాను, "భీము నీవు విశ్రాంతి తీసుకో......"

"తమరు చెప్పినట్లు నేను ఇక విశ్రాంతి తీసుకోవలసిందే సార్" అంటూ పాదాల మీద పడ్డాడు.


నమస్కరించి లేచేందుకు ప్రయత్నించాడు. కాని లేచేందుకు కాలేదు. నాకు అటు బస్సుకు వేళ అయ్యింది. "నేను వెళుతున్నాను భీము. పోదునా?" అవ్యక్త భావంతో అతడు నన్ను చూస్తూ, కుడి చేత్తో టాటా చేశాడు తడి కళ్లతో.

తరువాత భీము గణపతి గత్లలో వున్న తన ఇంటికి చేరాడో లేదో.... నాకు తెలీదు. ఎనభై కేజీల బరువున్న నాలాటి వారిని రిక్షాలో కూర్చోబెట్టుకొని సురక్షితంగా గూడు చేర్చుతున్న భీము, నేడు అలమటిస్తూ, పాపం ... అసమర్థుడుగా కూర్చొన్నాడు. అతన్ని కూర్చోబెట్టుకొని పోయేందుకు బహుశా ఏరిక్షా రాకపోవచ్చు.

★

# 'జీవని' కథా సంపుటికి

## నూతలపాటి సాహితీ సత్కారం - 1995



గంగాధరం సాహితీ కుటుంబం (రిజి) ఈ సంవత్సరం డా॥ వి. చంద్రశేఖరరావు కథల సంపుటి 'జీవని' కి 'నూతలపాటి సాహితీ సత్కారం' ప్రధానం చేస్తున్నది. రచయితకు మెమెంటో, రూ 1500/- లు మే 29 వ తేది జరిగే గంగాధరం వర్ధంతి సభలో అందజేస్తారు. కార్యదర్శి ఎస్.ముని సుందరం యీ విషయం తెలియజేస్తున్నారు.